

రాజుపాలెం ఎస్సీ కాలనీ కోదండరామస్వామి ఆలయంలో..



సత్తెనపల్లి కట్టమూరివారివీధిలో కల్యాణం వీక్షిస్తున్న భక్తులు



సత్తెనపల్లి గోళ్ళమూడివారివీధిలో సీతారాముల కల్యాణంలో...



వెంకటాయపాలెంలోని ఊరేగింపులో మహిళల కోలాటం



నందిగామలో అన్నసంతర్పణ



నందిగామలో ప్రత్యేక సీతారామ, లక్ష్మణుడు

కమనీయం.. కడు రమణీయం

- వాడవాడలా కనుల పండువగా సీతారాముల కల్యాణం
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

జగదానందకారకుడైన జగదభిరాముడు భూజాత సీతాదేవిల కల్యాణ మహోత్సవం వాడవాడలా కనుల పండువగా ఆదివారం జరిగింది. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని ప్రతి గ్రామంలోనూ చలువ పందిళ్లలో సర్వాలంకార భూషితుడైన శ్రీరాముడు, సీతాదేవిల ఉత్సవ విగ్రహాలకు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణ క్రతువును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.



క్రోసూరులో సీతారాముల గ్రామోత్సవం

సత్తెనపల్లి: శ్రీరామనవమి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని వడ్డవల్లి రామాలయం, వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, విశేష అర్చన నిర్వహించారు. అనంతరం సంప్రదాయ బద్ధంగా ఆలయ అర్చకులు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. 15 మంది దంపతులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- కట్టమూరి వారి వీధిలోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త చేపూరి పుల్లారావు ధర్మపత్ని రాధిక పీటలపై కూర్చున్నారు. అర్చకులు గుండవరపు అమర్నాథ్, విష్ణుశర్మలు శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.
- రఘురామ్‌నగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకుడు రవిపవన్‌కుమార్ ప్రత్యేక పూజలు, సంప్రదాయబద్ధంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన అన్న ప్రసాద వితరణకు 5,500 మందికి పైగా భక్తులు హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- గోళ్లమూడి వారి వీధిలోని ధనుంజయ కాంప్లెక్స్ వద్ద శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితుడు మైలవరపు సుబ్బారావు శాస్త్రి సంప్రదాయపద్ధంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు పానకం, వడపప్పు, అన్న ప్రసాద వితరణ చేశారు. 2,500 మంది భక్తులు అన్న ప్రసాద వితరణలో పాల్గొన్నారు.
- మహారాష్ట్రవీధిలోని భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా మేళతాళాలు, భాజాభజంత్రీలతో నిర్వహించారు. పలువురు దంపతులచే అర్చకులు చిరంజీవి సీతారాముల కల్యాణం జరిపించారు. హనుమాన్ చాలీసా పారాయణం , సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పానకం, వడపప్పు భక్తులకు పంపిణీ చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు. దేవస్థాన అభివృద్ధి కమిటీ బాధ్యులు దేవరశెట్టి కిషోర్, పులహరి ఫిరోజీ, జగతాపు మోహన్‌రావు, కటకం బాబు, సింధు వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ పురాహరి బానోజీ, తేనేటి ప్రసాద్, అశోక్, విశ్వనాథ్, కృష్ణ సాయి, పవన్, గటకాల లింగోజీ, సుకన్య, వసుంధర, అంజలి, ఉషారాణి పర్యవేక్షించారు.
- త్రిశక్తి దుర్గాపీఠంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించారు. పలువురు దంపతులచే ఆలయ అర్చకుడు సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. పీఠాధిపతి వెలిదండ్ల హనుమత్ స్వామి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- పట్టణంలోని పలు దేవాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేయడంతో పాటు అన్నప్రసాద వితరణ చేపట్టారు. అచ్చంపేట రోడ్‌లోని కోటమ్మ సత్రం వద్ద సీతారాముల కల్యాణం మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- మున్సిపల్ కార్యాలయ సమీపంలోని రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు మేదరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మేదరి సంఘం నాయకులు, పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.
- మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకోవడంతో ఆలయాలన్నీ కిక్కిరిసాయి. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నకరికల్లులో...

నకరికల్లు: మండలంలో సీతారాముల కల్యాణ వేడుక కనుల పండువగా జరిగింది. నకరికల్లులోని చౌత్రాసెంటర్, పాతూరులోని రామాలయం, దేచవరం, చల్లగుండ్ల, గుండ్లపల్లి, కుంకలగుంట, చీమలమర్రి, నర్శింగపాడు తదితర గ్రామాల్లో సీతారాములు కల్యాణం ఘనంగా జరిగింది. విశేషంగా అలంకరించిన మండపాల్లో స్వామి వార్ల ఉత్సవమూర్తులకు కల్యాణ వేడుక శాస్త్రోక్తంగా జరిపించారు. పలువురు దంపతులు పాల్గొన్నారు. అనంతరం పలుచోట్ల అన్నప్రసాద పంపిణీ గావించారు.

అమరావతిలో...

అమరావతి: మండల కేంద్రమైన అమరావతి, మండల పరిధి గ్రామాలలో సీతారాముల కల్యాణం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమరావతిలో పల్లపువీధి రామాలయం, మిట్టమీద రామాలయం, అగ్రహారం రామాలయం, ధరణికోట తూర్పు, పడమర వీధులలోని రామాలయాలలో, దిడుగు, మల్లాది, జూపూడి, మునగోడు, అత్తలూరు, పెదమద్దూరు, ఉంగుటూరు గ్రామాలలో శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.



సత్తెనపల్లి వడ్డవల్లి రామాలయంలో...

రాజుపాలెంలో...

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయాలను వివిధ రంగులు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. మండల కేంద్రంలోని రాజుపాలెం ఎస్సీ కాలనీలోని కోదండరామస్వామి దేవాలయం, బ్రాహ్మణపల్లి, మొక్కపాడు, గణపవరం, బలిజేపల్లి, ఉప్పలపాడు తదితర గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం పానకం, వడపప్పు పంచి పెట్టారు. అనంతరం రాజుపాలెం పురవీధుల్లో మేళతాళాలు, వాయిద్యాలతో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం సీతారాముల కల్యాణ వేడుక కనుల పండువగా జరిగింది. మండలంలోని గ్రామాలలో కల్యాణ వేడుకను గ్రామం పెద్దలు వైభవోపేతంగా నిర్వహించారు. మేళతాళాల నడుమ సీతారాములను పెళ్లి పీటలపై ఉంచి కల్యాణం జరిపించారు. మండల కేంద్రంలోని కోదండరామాలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. గ్రామ గ్రామాన పులిహోర, పానకం పంపిణీ చేశారు. మండలంలోని వెంకటాయపాలెంలో సీతారాముల కల్యాణం అనంతరం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బైక్ స్లో రేస్, 20 కిలోల రాయి చిటికెన వేలితో విసురుట, మోకు లాగు పందేలను నిర్వహించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. సాయంత్రం సీతారాములను గ్రామంలోని మహిళలు కోలాటమాడుతూ ఊరేగింపు చేశారు. శ్రీరామనవమి సందర్భంగా కోళ్లూరి ప్రసన్నాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసినట్లు ఆలయ అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు.

స్వామి వారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతల నుంచి భక్తులు తరలివచ్చారు.

ముప్పాళ్లలో...

ముప్పాళ్ల: మండలంలోని అన్ని గ్రామాలలో శ్రీరామ నవమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలోని రామాలయాల వద్ద తాటాకులతో పందిళ్లు వేసి ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. గ్రామాలలోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం పానకం, వడపప్పు పంచి పెట్టారు.

క్రోసూరులో...

క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని రాముల వారి ఆలయాల్లో కొన్ని చోట్ల పందిళ్లు ఏర్పాటు చేసి సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కల్యాణం అనంతరం సీతారాములకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం పానకం, వడపప్పు పంపిణీ, అన్నదానాలు నిర్వహించారు. క్రోసూరులోని వేణుగోపాల స్వామి గుడిలో రెడ్ల సంఘం, ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో చౌదర్ల సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహించారు.



75త్యాళ్ళూరు కోదండరామలయంలో...



పెదకూరపాడులోని ఎస్సీ కాలనీలో పల్నాడు అచారవంతుల సేవ



పెదకూరపాడులో విద్యుత్ ప్రభ ఊరేగింపు

ఘనంగా సీతారాముల కల్యాణం



పానకం అందిస్తున్న ముస్లిం సోదరులు

పెదకూరపాడు: శ్రీరామనవమి సందర్భంగా సీతరాముల కల్యాణం వాడవాడలా భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని 75త్యాళ్ళూరు కోదండరామాలయంలో కల్యాణం కనులపండవగా జరిగింది. వందలాది మంది భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. పెదకూరపాడులోని ఎస్సీ కాలనీలో పల్నాడు అచారవంతులు నవమి సందర్భంగా స్తంభం ఊరేగించి సేవ చేశారు. అనంతరం స్వామి కల్యాణం నిర్వహించారు. రాత్రి విద్యుత్ ప్రభను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. పలు సాంస్కృతిక కార్యాక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా స్వామి కల్యాణ మహోత్సం నిర్వహించారు. పలు చోట్లు అన్నదానం చేశారు.

మత సామరస్యం చాటిన ముస్లింలు

పెదకూరపాడు ముస్లిం కమిటీ యువకులు శ్రీరామనవమి సందర్భంగా మత సామరస్యం చాటుకున్నారు. స్వయంగా ముస్లిం యువకులు వడపప్పు, పానకం తయారు చేసి రామాలయాల వద్ద పంపిణీ చేశారు. హిందువులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో షేక్ అజిముల్లా, షేక్ ముంతాజ్ బేగం, షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ దిలీప్, పఠాన్ షబ్బీర్, షేక్ మలాట్ రఫీలను స్థానిక పెద్దలు ఆర్తిమళ్ల రమేష్, బెల్లంకొండ రామగోపాలరావు, వడ్లమూడి అప్పారావు, గల్లా శివలు అభినందించారు.



సత్తెనపల్లి మేదరి సంఘ రామాలయం వద్ద..



ముప్పాళ్లలోని ఆలయంలో...



నకరికల్లులోని చౌత్రాసెంటర్ వద్ద...



క్రోసూరు వేణుగోపాలస్వామి దేవస్థానంలో...

క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురంలో వేంచేసియున్న పద్మావతీ అలమేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. పంచాహ్నిక దీక్షతో నిర్వహించే బ్రహ్మోత్సవాలలో ఆదివారం ఉదయాన్నే మూలవిరాట్‌కు పంచామృతస్నపన, విశేషాలంకారం నిర్వహించారు. నిత్యహోమం, బలిహరణ అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తులను వెంకటాద్రి నాయుని మండపంలో ఉంచి కల్యాణ క్రతువును నిర్వహించారు. ఆలయ అర్చకులు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచన, నవగ్రహ మండపారాధన, కన్యాదానం, మాంగళ్యధారణ, తలంబ్రాల కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కళ్యాణ మూర్తులను సాయంత్రం గరుడ వాహనంపై గ్రామ వీధులలో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు

- మంజూరు కాని కొత్త రేషన్ కార్డులు
- సంక్షేమ పథకాలకు దూరం అవుతున్న ప్రజలు

అమరావతి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటినా కొత్త రేషన్ కార్డులపై ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. మండలంలో 22,384 రేషన్‌కార్డులు ఉండగా అందులో 60,853 మంది నమోదయ్యి నెలకు సుమారు 304 టన్నుల బియ్యం తీసుకుంటున్నారు. ప్రస్తుతం నూతనంగా రేషన్ కార్డులు కావాల్సిన వారు మండలంలోని అన్ని గ్రామాలలో కలిపి సుమారు 6 నుంచి 7 వేల వరకు ఉన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అరకొరగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు కావాలంటే దరఖాస్తుదారులు జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన పరిస్థితి. ఈ కారణంగా చాలా మంది అర్హులకు ఆనాడు న్యాయం జరగలేదు. పేదలకు నిత్యావసర సరుకులు, ప్రభుత్వ పథకాలు అందేవి కావు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ జన్మభూమి కమిటీలను నియమిస్తారా.. లేక కూటమి నేతలు జోక్యం చేసుకుంటారా అన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.



అమరావతి తహసీల్దార్ కార్యాలయం

త్వరగా నిర్ణయం తీసుకోవాలి



కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇంత వరకు కార్డుల మంజూరుపై నిర్ణయం తీసుకోకపోవడం దారుణం. కనీసం మార్పులు, చేర్పులకు కూడా అవకాశం లేకుండా పోయింది. చాలా మంది పేదలు రేషన్ కార్డులు లేకపోవడం కారణంగా సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారు. ప్రభుత్వం వీలైనంత త్వరగా కార్డుల జారీపై నిర్ణయం తీసుకోవాలి.

– భైరాపట్నం రామకృష్ణ, సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గసభ్యుడు

సమాచారం లేదు

కొత్త రేషన్ కార్డుల జారీపై ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదు. కార్డు లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే తెలియజేస్తాం. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ కార్డులు అందించేలా చర్యలు తీసుకుంటాం.

– ఎం.దానియేల్, తహసీల్దార్, అమరావతి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రెంటచింతల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 2014–15లో 10వ తరగతి చదివిన విద్యార్థులు కుశల ప్రశ్నలు, చిన్ననాటి జ్ఞాపకాలతో సరదాగ గడిపారు. 72 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకొన్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ రె. ఫాదర్ పీటర్ పాపయ్య మాట్లాడుతూ సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆత్మీయ సమ్మేళనం పూర్వ విద్యార్థులకు మరుపురాని రోజుగా మిగిలిపోతుందన్నారు.



చలివేంద్రం ఏర్పాటు

మాచవరం: శ్రీరామనవమిని సందర్భంగా మండల కేంద్రం మిషన్ బావి సెంటర్‌లో సప్తగిరి ట్రేడర్స్ ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ కటకం సూర్యనారాయణ ఆరేటి వెంకటేశ్వర్లు, సూరె నాగేశ్వరావు, ఆర్యవైశ్య పెద్దలు పాల్గొన్నారు.